


# కారణజన్ముడి కథ

మెగా అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సినిమా 'విశ్వంభర'. చాలాకాలం తర్వాత చిరంజీవి నటిస్తున్న సోషియోఫాంటసీ చిత్రమిది. దర్శకుడు వశిష్ఠ తొలి సినిమా 'బింబిసార' కూడా సోషియో ఫాంటసీ కథాంశమే కావడం విశేషం. ఆ సినిమా విజయమే ఆయన్ను చిరంజీవిని డైరెక్ట్ చేసే స్థాయికి తీసుకెళ్లిందని చెప్పాలి. ఈ సినిమా ద్వారా తెరపై ఓ కొత్తలోకాన్ని ఆవిష్కరించనున్నాడు వశిష్ఠ. ఇదొక భిన్నమైన కథ. ఓ బలమైన కారణంచేత దైవానుగ్రహంతో భూమిపై పుట్టిన కారణజన్ముడి కథతో ఈ సినిమా తెరకెక్కుతున్నదని ఫిల్మ్ వర్గాల టాక్. 'విశ్వంభర' అనేది ఒక లోకం అని తెలుస్తున్నది. ఈ సినిమా షూటింగ్ సగానికి పైగా పూర్తయింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో చివరి షెడ్యూల్ మొదలైంది. ఈ భారీ షెడ్యూల్‌తో చిత్రీకరణ పూర్తి చేయాలనే సంకల్పంతో ముందుకెళ్తున్నది 'విశ్వంభర' టీమ్. జూలై నాటికి చిత్రీకరణ పూర్తి చేసి, పోస్ట్ ప్రొడక్షన్‌కి ఎక్కువ సమయం తీసుకోనున్నారు దర్శకుడు వశిష్ఠ. ఈ సినిమా సీజీ, వీఎఫ్‌ఎక్స్ వర్క్ కోసం చిత్రబృందం విదేశాలకు కూడా వెళ్లనుందని విశ్వసనీయ సమాచారం. 2025 జనవరి 10న, సంక్రాంతి కానుకగా విడుదల కానున్న ఈ చిత్రానికి త్రిష కథానాయిక. మీనాక్షి చౌదరి, సురభి, ఇషా చావ్లా, అశికా రంగనాథ్ ప్రత్యేక పాత్రలు పోషిస్తున్నారు.



# బుజ్జి.. సినిమాకే సమ్‌థింగ్ స్పెషల్



'మూడేళ్లు బుజ్జితో ప్రయాణం చేశాను. బుజ్జి, భైరవ ప్రయాణం ఎగ్జైటింగ్‌గా ఉంటుంది. ఈ సినిమాలో బుజ్జిది చాలా ఇంపార్టెంట్ రోల్.' అన్నారు ప్రభాస్. ఆయన కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో ప్రతిష్ఠాత్మక వైజయంతీ మూవీస్ పతాకంపై సి.అశ్వనీదత్ నిర్మిస్తున్న చిత్రం 'కల్కి 2898 ఏడీ'. జూన్ 27న సినిమా విడుదల కానుంది. ఈ పాన్ ఇండియా సినిమా ప్రమోషన్స్ మొదలైన నాటి నుంచీ, సినిమాలోని ఒక్కో ప్రధాన పాత్రనూ రివీల్ చేస్తూ సినిమాపై అంచనాలు పెంచేశారు మేకర్స్. ఇందులో ప్రభాస్ 'భైరవ'గా నటిస్తున్న విషయం తెలిసిందే. భైరవ మిత్రుడైన 'బుజ్జి' పాత్రను బుధవారం హైదరాబాద్ ఆర్‌ఎఫ్‌సీలో ఓ ప్రత్యేక ఈవెంట్‌ని ఏర్పాటు చేసి, విభిన్నంగా 'బుజ్జి' కేరక్టర్‌ను చిత్రబృందం రివీల్ చేశారు. బుజ్జి అంటే 'కల్కి 2898ఏడీ' సినిమాలో ప్రభాస్ నడిపే కారు. ఆ సినిమాకోసం ప్రత్యేకంగా తయారు చేసిన ఆ కారును ప్రభాస్ నడుపుకుంటూ రివీలయ్యారు. ప్రభాస్ ఇంకా మాట్లాడుతూ –'దేశాన్ని ప్రభావితం చేసిన నటులు అమితాబ్ సార్, కమల్‌సార్. ఇద్దరు లివింగ్ లెజెండ్స్‌తో పనిచేసే అవకాశం ఇచ్చిన వైజయంతీ మూవీస్‌కి థ్యాంక్స్ చెప్పుకుంటున్నాను. ఆ విషయంలో నిజంగా నేను అదృష్టవంతుడ్ని. అలాగే దీపిక, దిషాపటాని వీరందరూ నా ఫిల్మ్‌లో భాగం అవ్వడం అశ్వనీదత్‌గారు నాకిచ్చిన గిఫ్ట్. ఆయన అంత పాషన్, ధైర్యం ఉన్న నిర్మాతను నేను చూడలేదు. ఆ తండ్రిలోని పేషన్‌ని, ధైర్యాన్ని పుణికిపుచ్చుకున్నారు స్వప్న, ప్రియాంక. వీళ్లందరి కృషే 'కల్కి 2898'. వచ్చే నెల 27 తర్వాత మళ్లీ కలుద్దాం. లవ్‌యూ డార్లింగ్స్' అంటూ అభిమానులకు అభివాదం చేశారు ప్రభాస్. 'బుజ్జి పేరు చిన్నగా అనిపించినా సమ్‌థింగ్ స్పెషల్. ఇంజినీరింగ్ చేయకుండానే ఇంజనీర్లుగా మారిపోయి ఈ కారు తయారు చేశాం. ఆనంద్ మహీంద్రగారు ఆయన టీమ్ సహకారంతో ఇది జరిగింది. బుజ్జి ఓ మ్యాజిక్' అని దర్శకుడు నాగ్‌అశ్విన్ అన్నారు. ఇంకా నిర్మాత అశ్వనీదత్‌తో పాటు చిత్ర యూనిట్ మొత్తం పాల్గొన్న ఈ కార్యక్రమానికి వేలాదిగా అభిమానులు తరలివచ్చారు.

# సేనాపతి రాజీలేని పోరాటం



కమల్‌హాసన్–శంకర్ కాంబినేషన్‌లో వచ్చిన 'భారతీయుడు' (1996) చిత్రం విమర్శకుల ప్రశంసలందుకోవడంతో పాటు బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించింది. సమాజాన్ని పట్టిపీడిస్తున్న అవినీతిపై సేనాపతి చేసిన పోరాటం అందరిని ఆకట్టుకుంది. ఈ సినిమాకు సీక్వెల్‌గా రూపొందిన 'భారతీయుడు–2' ప్రపంచవ్యాప్తంగా జూలై 12న రిలీజ్ కానున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రచారపర్వంలో వేగాన్ని పెంచారు. బుధవారం నాడు 'శౌర..' అనే లిరికల్‌సాంగ్‌ను విడుదల చేశారు. సుద్దాల అశోక్‌తేజ రాసిన ఈ గీతానికి అనిరుధ్ రవిచందర్ స్వరాలను సమకూర్చారు. రితేజ్ జి రావు, శృతికా సముద్రాల ఆలపించారు. పాటలోని విజువల్స్ ఆకట్టుకునేలా ఉన్నాయి. సీక్వెల్‌లో స్వాతంత్ర్య సమరయోధుడు సేనాపతి పోరాటం మరోస్థాయిలో ఉంటుందని చిత్రబృందం పేర్కొంది. ఎస్.జె. సూర్య, సిద్ధార్థ్, కాజల్ అగర్వాల్, రకుల్ ప్రీత్‌సింగ్, ప్రియా భవానీశంకర్, నెడుముడి వేణు, వివేక్, కాళిదాస్, జయరాం, గుల్షన్ గ్రోవర్, సముద్రఖని, బాబీ సింహా, బ్రహ్మానందం, జాకీర్ హుస్సేన్, తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్ రవిచంద్రన్, కెమెరా: రవివర్మన్, ఎడిటింగ్: ఎ.శ్రీకర్‌ప్రసాద్. నిర్మాణం: లైకా ప్రొడక్షన్స్, రెడ్ జెయింట్ ప్రొడక్షన్స్.

# 'లవ్‌మీ'లో అన్నీ సర్‌ప్రైజ్‌లే..!

**''లవ్‌మీ' సినిమా చాలా సర్‌ప్రైజ్‌లుంటాయి. ఊహకందని మలుపులు, చక్కటి ప్రేమకథతో ఆకట్టుకుంటుంది' అన్నారు యువ హీరో ఆశిష్. ఆయన నటించిన తాజా చిత్రం 'లవ్‌మీ'. అరుణ్ భీమవరపు దర్శకుడు. శిరీష్ సమర్పణలో దిల్‌రాజు ప్రొడక్షన్స్ పతాకంపై హర్షిత్ రెడ్డి, హన్షిత, నాగ మల్లిడి నిర్మించారు. ఈ నెల 24న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా బుధవారం ఆశిష్ పాత్రికేయులతో పంచుకున్న విశేషాలివి..**



- గత చిత్రాలకు భిన్నంగా కాస్త డార్క్‌షేడ్‌లో నా క్యారెక్టర్ సాగుతుంది. ఈ సినిమాలో నేను యూట్యూబర్‌గా కనిపిస్తాను. ఓ దెయ్యానికి సంబంధించిన స్టోరీ విషయంలో అతనికి ఎలాంటి పరిణామాలు ఎదురయ్యాయి? అతని జీవితం ఎలాంటి మలుపులు తిరిగిందన్నది ఆద్యంతం ఆసక్తికరంగా అనిపిస్తుంది.
- ఈ సినిమాలో దెయ్యం ఎవరన్నది సస్పెన్స్. అందరూ అనుకుంటున్నట్లుగా కథానాయిక వైష్ణవి చైతన్యది దెయ్యం పాత్ర కాదు. కథానుగుణంగా ఐదారుగురు నాయికలు కనిపిస్తారు. చిత్ర దర్శకుడు అరుణ్ నవలా రచయిత కాబట్టి ఈ సినిమాను ఎమోషనల్‌గా తెరకెక్కించాడు.
- ఈ సినిమాలో హారర్ ఓ భాగం మాత్రమే. ఓ పెద్ద సమస్యకు పరిష్కారాన్ని కనుక్కునే యువకుడిగా నా పాత్ర భిన్న కోణాల్లో సాగుతుంది. ఈ కథలో పగ, ప్రతీకారం వంటి అంశాలు ఉండవు. చక్కటి ప్రేమకథగా మెప్పిస్తుంది. క్లైమాక్స్‌లో వచ్చే ట్విస్ట్ సర్‌ప్రైజ్‌కు గురిచేస్తుంది.
- ఈ సినిమాకు ఛాయాగ్రాహకుడిగా పీసీ శ్రీరామ్, సంగీత దర్శకుడిగా కీరవాణి వంటి లెజెండ్స్ పని చేశారు. వారితో కలిసి వర్క్ చేయడం వల్ల ఎన్నో కొత్త విషయాలను నేర్చుకున్నా. పీసీ శ్రీరామ్‌గారి కెమెరా వర్క్ కథను మరింతగా ఎలివేట్ చేసింది.
- ఈ సినిమా క్లైమాక్స్‌లో ఊహించని ట్విస్ట్ ఉంటుంది. కథాపరంగా సీక్వెల్‌కు అవకాశం ఉంది. ఇప్పటివరకైతే సీక్వెల్ చేయాలని అనుకోవడం లేదు. ఈ విషయంలో దిల్‌రాజుగారు నిర్ణయం తీసుకుంటారు. ప్రస్తుతం 'సెల్ఫిష్' చిత్రాన్ని చేస్తున్నా. అది పూర్తయ్యాక సితార సంస్థలో ఓ సినిమాలో నటించబోతున్నా.

# అదంతా అమ్మ ప్రభావం

తల్లి అతిలోకసుందరి అయినప్పుడు ఆమె పోలికలతో పుట్టిన కూతురూ అతిలోకసుందరే కదా. నిజానికిక్కూడా న్యూ జనరేషన్ శ్రీదేవిలా మెరిసిపోతుంటుంది జాన్వీకపూర్. బాలీవుడ్‌లో తను నటించిన 'మిస్టర్ అండ్ మిసెస్ మహి' చిత్రం ప్రమోషన్‌లో ప్రస్తుతం బిజీగా ఉన్నది జాన్వీ. ఈ సందర్భంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తెలుగులో తాను చేస్తున్న 'దేవర' సినిమా గురించి ఆసక్తికరంగా మాట్లాడింది. 'దేవర'లో అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను. ఆ సినిమా యూనిట్ సభ్యులు నాతో ప్రేమగా ఉండటం చూస్తుంటే.. ఇదంతా అమ్మ ప్రభావం అని అర్థమవుతుంది. అందరూ అంకితభావంతో పనిచేస్తున్నారు' అంటూ చెప్పుకొచ్చింది జాన్వీ. ఇంకా చెబుతూ ' 'దేవర' భిన్నమైన కథ. తెరపై ఓ అందమైన వాతావరణం ఉంటుంది. ఇందులో నా పాత్ర పేరు 'తంగం'. వినోదాత్మకమైన పాత్ర. కచ్చితంగా మంచి పేరు తెచ్చే పాత్ర అవుతుంది. అక్టోబర్10 కోసం అందరితోపాటు నేనూ ఆతృతగా ఎదురుచూస్తున్నా' అని తెలిపింది జాన్వీకపూర్.



## పర్సంటేజీ విధానం లేకుంటే థియేటర్లను మూసేస్తాం

అద్దె ప్రాతిపదికన ఇక నుంచి సినిమాలను ప్రదర్శించబోమని, సినీ నిర్మాతలు పర్సంటేజీ చెల్లించకపోతే సింగిల్ స్క్రీన్ థియేటర్ల మూసివేత తప్పదని తెలంగాణ ఫిల్మ్ ఎగ్జిబిటర్ల అసోసియేషన్ హెచ్చరించింది. బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో వారు తమ డిమాండ్లను వెల్లడించారు. 'ఇప్పటికే సింగిల్ స్క్రీన్స్‌లో సినిమా ప్రదర్శనలను నిలిపివేశాం. జూలై 1 వరకు నిర్మాతలకు గడువు ఇస్తున్నాం. మల్టీప్లెక్స్ తరహాలో పర్సంటేజీలు చెల్లిస్తేనే సినిమాలను ప్రదర్శిస్తాం. కల్కి 2898 ఏడీ, పుష్ప–2, గేమ్ ఛేంజర్, భారతీయుడు–2 చిత్రాలకు మినహాయింపు ఉంటుంది. మిగతా చిత్రాలను మాత్రం పర్సంటేజీ విధానంలోనే ప్రదర్శిస్తాం. కొంతమంది డిస్ట్రిబ్యూటర్లు బెనిఫిట్‌షోలు, అదనపు ఆటలతో సినీ వ్యాపారాన్ని జూదంగా మార్చారు. ఇక నుంచి బెనిఫిట్‌షోలు, అదనపు ఆటలను ప్రదర్శించం' అని తెలంగాణ ఫిల్మ్ ఎగ్జిబిటర్ల అసోసియేషన్ పేర్కొంది.

# పుష్ప పాట గుర్తింపునిచ్చింది



'పుష్ప–2' చిత్రం నుంచి ఇటీవల విడుదలైన 'పుష్ప పుష్ప..' అనే మాస్ గీతానికి మంచి స్పందన లభించింది. సోషల్‌మీడియాలో ఈ పాట రికార్డులు సృష్టించింది. ఈ నేపథ్యంలో ఈ పాటను ఆలపించిన గాయకుడు దీపక్‌బ్లూ బుధవారం పాత్రికేయులతో ముచ్చటిస్తూ 'తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో ఇప్పటివరకు 300లకుపైగా పాటలు పాడాను. చెన్నైలో స్థిరపడ్డ తెలుగు కుటుంబం మాది. గత పన్నెండేళ్లుగా గాయకుడిగా కెరీర్ కొనసాగిస్తున్నా' అన్నారు. 'పుష్ప పుష్ప' పాట గురించి మాట్లాడుతూ 'దేవిశ్రీప్రసాద్ సంగీత దర్శకత్వంలో తొలుత 'నాన్నకు ప్రేమతో..' చిత్రంలో 'లవ్ దెబ్బ' అనే పాట పాడాను. అది పెద్ద హిట్ అయ్యింది. అలాగే తమన్ డైరెక్షన్‌లో 35 పాటలు పాడాను. 'పుష్ప–2'లోని టైటిల్‌సాంగ్ నాకు మంచి పేరు తీసుకొచ్చింది. భవిష్యత్తులో ఇండిపెండెంట్ ఆల్బమ్ చేయాలని ఉంది. ఈ మధ్యే పెద్ద సినిమాలకు పాటలు పాడాను. వాటి రిలీజ్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా' అన్నారు.

# ఫాంటసీ యక్షిణి



ఫాంటసీ, రొమాన్స్, కామెడీ అంశాల కలబోతగా రూపొందిన వెబ్ సిరీస్ 'యక్షిణి'. వేదిక, మంచులక్ష్మి, రాహుల్ విజయ్, అజయ్ ముఖ్యపాత్రధారులు. తేజ మార్ని దర్శకుడు. ఆర్కా మీడియా వర్క్స్ పతాకంపై శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని ఈ సిరీస్‌ని నిర్మించారు. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచే సిరీస్ ఇదని, దర్శకుడు తేజ మార్ని విజన్‌కు తగినట్టు భారీ నిర్మాణ విలువలతో ఈ సిరీస్‌ను నిర్మించామని, ప్రఖ్యాత ఓటీటీ ప్లాట్‌ఫామ్స్ అయిన డిస్నీ ప్లస్ హాట్‌స్టార్‌లో, జూన్ నుంచి తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ సిరీస్ స్ట్రీమింగ్ కానుందని మేకర్స్ తెలిపారు.

# తొమ్మిదేళ్ల విరామం తర్వాత మళ్లీ మెగాఫోన్



తొమ్మిదేళ్ల విరామం తర్వాత వైవీఎస్ చౌదరి మెగాఫోన్ పట్టనున్నారు. సాయిధరమ్‌తేజ్‌ను హీరోగా పరిచయం చేస్తూ 2015లో 'రేయ్' సినిమాను తెరకెక్కించారాయన. ఆ తర్వాత సినిమా చేయలేదు. మళ్లీ ఇన్నాళ్లకు 'యాక్షన్.. కట్..' చెప్పనున్నారు. నేడు వైవీఎస్ చౌదరి పుట్టినరోజు. అలాగే ఆయన అభిమాన దర్శకుడైన కె.రాఘవేంద్రరావు పుట్టినరోజు కూడా నేడే. ఈ సందర్భంగా తన కొత్త సినిమాకు సంబంధించిన ప్రకటనను మీడియాకు విడుదల చేశారు వైవీఎస్. ఆయన తొలి చిత్రం 'సీతారాముల కల్యాణం చూతమురారండి' ద్వారా వెంకట్, ఛాందినీలను హీరోహీరోయిన్లుగా పరిచయం చేసిన వైవీఎస్.. 'లాహిరి లాహిరి లాహిరిలో' ద్వారా ఆదిత్య ఓం, అంకితలను, 'దేవదాసు' ద్వారా రామ్, ఇలియానాలను వెండితెరకు పరిచయం చేసి, కొత్తవారితో సినిమాలు తీయడంలో సిద్ధహస్తుడిగా పేరు గడించారు. ఇప్పుడు మళ్లీ కొత్త నటీనటులతోనే హై టెక్నికల్ వాల్యూస్‌తో కూడిన న్యూ ఏజ్ యూనిక్ లవ్‌స్టోరీని తెరకెక్కించనున్నారు వైవీఎస్. ఈ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలో తెలియజేస్తామని ఆయన అన్నారు.

# హారర్ థ్రిల్లర్ కథతో..



ఆదాశర్మ కథానాయికగా నటిస్తున్న తాజా చిత్రం 'సీ.డీ'. (క్రిమినల్ అండ్ డెవిల్). కృష్ణ అన్నం దర్శకుడు. ఈ నెల 24న విడుదలకానుంది. ఈ చిత్ర సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. యు.ఏ.సర్టిఫికెట్ లభించింది. దర్శకుడు మాట్లాడుతూ 'డిఫరెంట్ కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. హారర్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా ఆకట్టుకుంటుంది. ఆదాశర్మ పాత్ర కొత్త పంథాలో సాగుతుంది. భారీ ఎత్తున విడుదకు సన్నాహాలు చేస్తున్నాం' అన్నారు. విశ్వంత్, జబర్దస్త్ రోహిణి, భరణి శంకర్, రమణ భార్గవ్, మహేష్ విట్టా తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సతీష్ ముత్యాల, సంగీతం: ఆర్.ఆర్.ధృవన్, కథ, సంభాషణలు: ఏ.ముద్దుకృష్ణ, దర్శకత్వం: కృష్ణ అన్నం.